
Krishna

# కాస్త కన్ఫ్యూషన్

**- కలువకుంట నారాయణ**

సాయంత్రం అయిదున్నర గంటలు కావస్తూంది. బస్ స్టాప్‌లో దాదాపు ఇరవై మందికిపైగానే ఉంటారు. ఆకాశం మేఘావృతం అవుతోంది. గంటసేపట్నుంచి ఎదురుచూస్తున్నా రావలసిన ఆర్. టి. సి. బస్సు రాలేదు. ఒకవేళ వచ్చినా ఆగుతుందనేది సంశయాస్పదమైన విషయం. మిగిలిపోయిన బట్టల్లో ఉన్న ఒక ముసలావిడ తప్ప స్టాప్‌లో ఉన్న మిగిలిన వాళ్ళందరూ నాగరికత ముసుగులో ఉన్నవాళ్ళే. మిస్ సుమిత్ర ఆ ముసలావిడకు కొంతదూరంలో నిలబడి ఉంది. చాలాసేపు నిలబడడం కష్టంగా ఉన్నా, అలా నిలబడడమే ఫ్యాషన్ కాబోలు. మగాళ్ళందరు తనవేపే చూస్తున్నట్లనిపిస్తూంది సుమిత్రకు. అందువల్ల సుమిత్రకు రాని బస్సుమీద విసుగుకంటె అక్కడున్న మగాళ్ళమీదే విసుగు అధికంగా ఉంది.

మిస్ సుమిత్ర ఆ బస్ స్టాప్‌కు కొంతదూరంలో ఉన్న ఒక ఆఫీసులో టైపిస్టుగా చేరి ఇంకా సంవత్సరం కూడా కాలేదు. పాతికేళ్ళు నిండిన సుమిత్ర జీవితాన్ని, ప్రపంచాన్ని చాలావరకు తెలుసుకున్నట్లు ఒక దృఢవిశ్వాసం ఏర్పరచుకుంది. ముఖ్యంగా పురుష ప్రపంచం అంటే ఒక దురభిప్రాయం ఏర్పడింది. తాను ఉద్యోగంలో చేరిన మరునాటి దినమే తన సెక్షన్ హెడ్ (వయస్సు సలభైయ్యైదు దాటి ఉంటాయి) తన సీటుకు నేరుగా తన సీటును అరేంజి చేసుకోవడం, ఎప్పుడూ తనవైపే చూస్తూ ఉండడం, ఏదో నెపంమీద తనను పలకరిస్తుండడం.... ఇట్లా కారణాలు ఎన్నో చెప్పుకుంటూపోవచ్చు. ఇలాంటి మనస్తత్వంగల మగవాళ్ళెందరో సుమిత్రకు తారసిల్లారు. అందుకే మగ పురుగుల్ని అసహ్యంగా చూస్తుంది సుమిత్ర.

మరోసారి మగవాళ్ళవేపు చూసింది సుమిత్ర. అందరు తనవైపే చూస్తున్నట్లనిపించింది. ఒకసారి బస్సును మనస్సులో గట్టిగా తిట్టుకుంది. ఆకాశంలోని మేఘాలు మరీ దట్టమైనాయి.

సన్నగా ఒక్కొక్క జల్లు పడడం ప్రారంభమైంది. ఇప్పుడేం చేయాలి? సుమిత్రకు సమాధానం తోచలేదు. వర్షంలో తడిస్తే తనకు జ్వరం వస్తుంది. బ్లడ్ టెస్ట్ చేసి డాక్టర్లు ఐస్‌క్రీమ్ తినరాదు, మంచులో, వర్షంలో తడవరాదు—ఇలా ఎన్నో ఆంక్షలు పెట్టారు. ఈరోజు అనుకోని విధంగా బస్సు రాకపోవడం, వర్షం రావడం సుమిత్ర మనస్సును క్షోభింప జేస్తున్నాయి. సుమిత్ర స్టాప్ దగ్గర్నుంచి మెల్లగా దగ్గర్లో కనిపించే ఒక డాబా ఇంటివైపు నడవడం ప్రారంభించింది. ఆ ఇల్లు దగ్గర్లో ఉన్నట్లు కన్పించినా, ఒక ఫర్లాంగు దూరాని కేమాత్రం తీసిపోదు. వర్షం జల్లు ఉద్ధృతమైంది. ఆ ఇంటికి చేరేలోపుగా తను తడిసిపోవడం ఖాయం. కొంత నడక వేగాన్ని పెంచింది. వర్షంలో తడిసినా నాగరికతే అవుతుంది కాని, అలా రోడ్డుమీద పరిగెత్తితే మాత్రం నామోషిగా ఉంటుంది.

ఇంతలో ఒక వ్యక్తి ఆమెవెంట వస్తున్నట్లనిపించింది. తిరిగి చూచింది. అతను ఆమెను చూచాడు. అతని చేతిలో గొడుగుంది. సరిగ్గా అతని వయస్సు తన ఆఫీసు సెక్షన్ హెడ్ వయస్సంతే ఉంటుంది.

"మీ కభ్యంతరం లేకుంటే గొడుగు క్రిందికి రండి" అన్నాడు ఆయన. అతని మాటల్లో ఏదో అర్థం ఉన్నట్లనిపించింది సుమిత్ర మనసుకు. అవకాశం దొరికితే చాలు, అందమైన అమ్మాయిలకు సహాయపడడానికి నేను, నేను అని ముందుకువస్తారు మగరాయుళ్ళు. పరోపకారపరాయణుల్లాగా ఫోజులు పెడతారు. సుమిత్ర అతనివైపు అసహ్యంగా చూసి మరీ వేగంగా డాబా ఇంటివైపు పరుగులాంటి నడకతో వెళ్ళింది.

అతను ఆమె చూపును గురించి పట్టించుకోలేదు. వర్షం బలంగా పుంజుకొంటున్నా, చేతిలో గొడుగుండడంతో అతను మామూలుగానే నడుస్తున్నాడు. ఇంతలో బస్ స్టాపులో ఉండిన ముసలావిడ వేగంగా అతని వెనుక రావడం అతను గమనించాడు. కాస్సేపాగాడు. ఆమె దగ్గరకు వచ్చేసింది.

"గొడుగు కిందికి వచ్చేయ్, అవ్వా" అన్నాడు అతను.

"నువ్వెవరో గాని మంచివాడులాగున్నావ్, బాబూ" అని అతన్ని పొగుడుతూ గొడుగు క్రిందికి వచ్చింది.

అతను డాబా ఇంటివైపే నడుస్తున్నాడు. ముసల్ది అతన్ని అనుసరిస్తూ ఉంది.

"అసలే రోగిష్టిదాన్ని...ఈ వానలో తడిస్తే నాకు సరిపడదు...." అంటూ ఏదో సణుగుకుంటూ నడుస్తున్నది ఆమె.

* * *

సుమిత్ర బస్‌స్టాప్ దగ్గరకు వచ్చింది. అక్కడ పదిరోజులకు ముందు వర్షంలో కనిపించిన గొడుగు మనిషి కన్పించాడు. ఆరోజు కూడా చేతిలో గొడుగుంది. ఇంతలో ఎవరో వచ్చి అతనికి నమస్కారం చేశారు. అతను ప్రతి నమస్కారం చేశాడు. వాళ్ళిద్దరు మాటల్లో మునిగిపోయారు. సుమిత్ర వాళ్ళ మాటల్ని విననట్లే నటిస్తూ ప్రతి మాటా గమనిస్తూంది.

గొడుగు మనిషి ఏదో స్కూల్లో పంతులుగా పని చేస్తున్నాడు. అతనికి నలుగురు కూతుళ్ళు. పెద్ద కూతురి పెండ్లి సంబంధంగా ఆయన చాల రోజులుగా నానా తంటాలు పడుతున్నాడు. తన కుమార్తె పెండ్లి విషయంగానే ఆ మిత్రునితో మాట్లాడుతున్నాడు—ఇదీ సుమిత్ర గొడుగుమనిషి గురించి గ్రహించిన కథ. అతని మాటల్లో ఎంతో సంస్కారం ఉంది. ప్రపంచంలోని వేదనను అర్థం చేసుకొన్న వ్యక్తిగా కన్పించాడు. అతని మనస్సు స్వచ్ఛంగా ఉందనిపించింది. సుమిత్ర అనాలోచితంగా అతనికి దగ్గరగా వెళ్ళి "నమస్కారం, సార్" అంది.

"నమస్కారం"—అన్నాడు నిర్లిప్తంగా. కొంతసేపయ్యాక, "మీ రెవరో తెలుసుకోవచ్చా?" అని ప్రశ్నించాడా గొడుగు వ్యక్తి.

"అదే, సార్...పదిరోజులకుముందు — వర్షంలో మీ రివ్వబోయిన సహాయాన్ని నిరాకరించినదాన్ని' తాను తప్పు చేసినట్లున్నది సుమిత్ర గాత్రం.

"ఓ! అలాగా" అన్నాడు అతను.

"మిమ్మల్ని అపార్థం చేసుకొన్నాను సార్!" క్షమించమని అర్థించినట్లున్నది ఆమె మాటలు.

"దానికేముందిలే అమ్మాయ్" అన్నా డాయన.

"నేను ఆనాడు వర్షంలో తడవడంవల్ల జ్వరం సోకి, వారంరోజులు ఆఫీసుకు సెలవుపెట్టి వైద్యం చేసుకోవాల్సి వచ్చింది. నిన్నటిదాకా రెస్టు తీసుకొని ఈరోజే ఆఫీసుకు వచ్చి ఇంటికి వెళ్ళుతున్నాను." సుమిత్ర ఆత్మీయంగా మాట్లాడింది.

"అలాగా!" అన్నాడు జాలిగా.

"మీ పరోపకార గుణాన్ని గుర్తించలేకపోయాను, సార్, అంది సుమిత్ర.

"ఆనాడు నువ్వే పరోపకారం చేశావు" అన్నాడు ఆయన ఆశ్చర్యంగా. ఏమీ అర్థం కానట్టు ఆయన్ని చూసింది సుమిత్ర.

"అవును. నువ్వు నాలుగురాళ్ళు సంపాదిస్తున్నావు కాబట్టి ఎలాగో నీకు వచ్చిన జబ్బును నయం చేసుకోగలిగావు. విశ్రాంతి తీసుకొన్నావు. కాని ఆ రోజు ఆ ముసల్ది వర్షంలో తడిసి కనుక ఉంటే ఆమెకు వైద్యం, విశ్రాంతి....ఎక్కడి నుండి లభించేవి....పరోక్షంగా నువ్వు ముసలావిడకు ఉపకారం చేశావు. ఆ పుణ్యం నీకే దక్కుతుంది. కాబట్టి నిన్ను అభినందించాలి" అన్నాడు ఆయన సరళంగా.

ఆయన మాటలు వింటుంటే సుమిత్రకు ఏదో వెలుగు, లోకం తనకు కన్పిస్తున్నట్లనిపించింది. ఎదుటివారి దుర్గుణంలో కూడా మంచిని వెదకే ఆ మహాత్మునికే విధంగా జోహార్లర్పించాలో సుమిత్రకు బోధపడలేదు. *